# కవర్లు చేసిన హడావిడి

శ్రీ ఎస్. ఎమ్. వాద్రేవ్

"పోస్ట్"

అని కేకవినబడగానే లలితవచ్చి కవరు నందుకుంది. ఇంట్లోకి వచ్చినతర్వాత దాని మీద ఎడ్రస్ తనదేయని తెలుసుకుని చింపి చదువుకుంది.

"ఎవరిదగ్గర్నుంచి?" భర్తకృష్ణప్రశ్న.

"మా అన్నయ్య వ్రాశాడు." భార్య లలిత జవాబు.

ఒకరిమనసులొకరికి తెలుసును కాబట్టి తన భార్య అబద్ధం చెప్పదనే నమ్మకంతో దాంట్లో విశేషాలేమిటని అడగలేదు కృష్ణ. ఎవరికి వుత్తరాలు వచ్చినా యింతే. తర్వాత రెండు రోజులకి ఓ వుత్తరం వచ్చింది. 'మా నాన్నగారు వ్రాశాడ'ని చెప్పింది.

♦ ♦ ♦

పురిటికోసమని లలిత పుట్టింటికి వెళ్లవలసివచ్చింది. మరునాడు కృష్ణ ఆఫీసుకి వెళ్లేసమయంలో పోస్టువాడు ఓ కవరు ఇచ్చి వెళ్ళాడు. అది భార్యపేరవచ్చింది. ఇంకా నెల్లాళ్లదాక రాదుకదా విశేషాలేమి వున్నాయో కవరు తెరిచాడు. సగం లోనే ఆగిపోయాడు. గుండె బేజారెత్తిపోయింది. తల తిరిగినట్లు అయిందతనికి. ఆ వుత్తరం 'శంకర్, MBB'S డాక్టర్ దగ్గర్నుండి వచ్చింది. భార్య యింత నీచ ప్రవర్తనకు గురి అవుతుందని ఎన్నడూ తలచలేదు. తర్వాత రెండు ఉత్తరాలు వచ్చాయి. అవి చదివి దాచేశాడు. మరో నెలరోజులకి లలిత ఆడపిల్లను చంకను బెట్టుకొని వచ్చింది. మర్నాటినుండి ఎడ మొహం, పెడ మొహంకింద తయారయింది. ఎందుకని అడిగితే తప్పించుకు తిరుగుతున్నాడు. నెమ్మదిగా రోజులు గడుస్తున్నాయి.

కృష్ణ ఆఫీసుపనిమీద ఆగ్రా వెళ్ళవలసి వచ్చింది. జాగ్రత్తగా వుండమని చెప్పి మరీ వెళ్ళాడు. కృష్ణ వెళ్ళిన రెండు రోజులకు అతని పేర ఒక కవరు వచ్చింది. నాలుగు రోజులు దాక రాదుకదా ఆ వుత్తరంలో ఏం ప్రమాదం వుందో తెలుసుకోడం మంచిదని కవరు తెరిచింది. తను అనుకున్నంతపని అయింది. గడగడలాడిపోయింది. ఆ వుత్తరం 'కోకిల' అనే నర్సు దగ్గర్నుండి వచ్చింది. తన భర్త యిలా చేస్తాడని ఎప్పుడూ అనుకోలేదు. ఇపుడు ఆఫీసుపని అని చెప్పి దాని దగ్గరకు వెళ్తారేమో అనుకుంది. తర్వాత మూడుత్తరాలు వచ్చాయి-దాచేసింది. అన్నట్టుగానే నాల్గు రోజుల కల్లా దిగాడు. భార్య మొహంలో ఓ పెద్ద విశేషముందనుకున్నాడు. కారణమేమిటని అడిగితే విసుగులు తసుగులూ, అంతగా అడిగితే చీవాట్లు, చెప్పు దెబ్బలూను. యింకా అడిగితే ఆఫీసు

ప్రైముకి భోజనం దొరకదేమోనని భయపడి అడగడం మానేశాడు.

♦ ♦ ♦

శంకర్, లలిత చిన్నప్పటినుండి అన్నాచెల్లెళ్లలాగ ఎంతో అన్యోన్యంగా వుండేవారు. ఒకే స్కూల్లో చదువుకున్నారు. శంకర్ యింటర్ ప్యాసయి M B B S. చదవడానికి వైజాగ్ వెళ్లిపోయాడు. లలిత యింటర్‌లో తప్పింది. పెళ్లివయసు వచ్చిందని చదువు మానిపించేసి కృష్ణకిచ్చి వివాహం చేశారు. తర్వాత విడిపోయినా ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం జరుగుతూనే వున్నాయి.

ఇంక కోకిల, కృష్ణల సంగతి. వీరిద్దరూ కూడా చాలా స్నేహంగా వుంటూ స్కూలు ఫైనలువరకూ చదువుకున్నారు. తల్లిదండ్రులు కృష్ణకి లలితనిచ్చి పెళ్ళి చేశారు. కోకిల నర్సరీ ట్రయినింగ్‌కి వెళ్ళిపోయింది. యిద్దరూ దగ్గర లేకపోయేసరికి చాలా బాధపడ్డారు.

♦ ♦ ♦

నెలరోజులు గడిచాయి. మళ్ళీ లలిత పేర శంకర్ వుత్తరం వ్రాశాడు, 'వచ్చే సోమవారం తన పెళ్లి అని, తప్పకుండా రావలెనని' లలిత చాల సంతోషించింది, కాని, స్నేహితుని పెళ్లికి వెళ్తానంటే భర్త ఒప్పుకుంటాడా మరి! భోజనాల టయింమయింది. భోంచేస్తూ కృష్ణ యిలా అన్నాడు:

"నా చిన్నప్పటి స్నేహితురాలి పెళ్లికి వెళ్తున్నా"

"ఎపుడు పెళ్లి?"

"సోమవారం రాత్రి" అమ్మయ్య! తన స్నేహితుడి పెళ్ళికూడా ఆ రోజే. యిద్దరికీ సరిపోతుంది అనుకుంది.

"అయితే రెండుమూడు రోజులముందుగానే వెళ్లాలి. పాపం చిన్నప్పటి స్నేహితురాలు కదా మరి" అంది లలిత.

"ఆ దిగులు నీ కెందుకు." అన్నాడు కృష్ణ.

♦ ♦ ♦

ఆదివారం వచ్చింది. రేపే పెళ్ళి ఎలా వెళ్లేది అని ఆలోచిస్తోంది.

"ఏమండీ! మీ స్నేహితురాలికి ప్రజంటు ఏం యిస్తారు"

"నేనా ....ఏదీ . .ఏదో యిద్దామనే వుంది కానీ . ."

"కానీ ఏమిటండీ ఒక నైలాన్ చీర"

"ఛ......"

"బండార్లంక నేత చీర"

"ఛ......ఛ నీ కేమైనా మతిగాని పోయిందా!"

"మరింకేం కొంటారు. బెంగుళూరు సిల్కు చీర"

"ఆ! అద్గది - అది చాల బాగుంటుంది. నీ ఆలోచన రాజుగారి దగ్గర మంత్రి ఆలోచనలా వుంది."

"నాకు కొనిపెట్టమంటే చేతులాడవ్ కాని ఎవరికో..."

"ఆఁ!...చాలు..చాలు నీవేదాంతం యిక.."

భార్య తొందరవల్ల కృష్ణ బజారుకి వెళ్లక తప్పిందికాదు. ఆ వెనకనే లలిత వెళ్లి తన స్నేహితుడికి ఓ గాబర్డీన్ సూట్ కొని భర్తకన్నముందే వచ్చింది ఇంటికి. కృష్ణ భోంచేసి సిద్ధంగావున్న రైలెక్కి వెళ్ళిపోయాడు. తర్వాత లలిత నోట్లో నాల్గు మెతుకులు కుక్కుకుని ఆ బండికే చేరుకుంది.

♦ ♦ ♦

వారి వారి స్నేహితులను నవ్వించి, కవ్వించి ఆనందంతో ముంచారు. ముహూర్తం టయిమయింది. ఆడవాళ్లందరూ సిల్కు చీరలతోటి ఫ్లోరసెంటు దీపాలముందు మెరసిపోతున్నారు. నవయువకులు యిదేసమయమని, వయసు వచ్చిన ఆడపిల్లల వెంబడి వెళ్లి కొంగు తగిలేసరికి అంతోయింతో సంబరపడుతున్నారు. మధ్యవర్తులు కూర్చుని కట్నాల గురించి చర్చించుకుంటున్నారు. ఆడపిల్లలున్న తల్లిదండ్రులు తన కూతురికి ఏ పిల్లవాడు నచ్చుతాడో అని తేరి పార చూచేవారు. చూడండి ఒక పెళ్లి జరుగుతోంది అంటే యింకో నూతన దంపతులు స్థిరపడిపోతారు. యింకో నాల్గు రోజులకే పెళ్లి. పురోహితుడు- ఫలానావాళ్లు చదివించారు అని ఆ బహుమతులు వధూవరులకి సమర్పిస్తున్నాడు.

ఆశ్చర్యం! ఒకవైపునుండి పెళ్లికొడుకికి అని లలిత. మరియొక వైపునుండి పెళ్లికూతురికి అని కృష్ణ. ఇద్దరి చేతులు తగిలేసరికి ఒకరి మొహాలు ఒకరు చూచుకున్నారు, దిగ్భ్రాంతులయ్యారు.

యింతకీ అక్కడి వివాహం ఎవరెవరికనుకున్నారు: లలిత స్నేహితుడు శంకర్‌కి. కృష్ణ స్నేహితురాలు కోకిలకి జరిగింది. అన్నితతంగాలు అయిపోయింతరువాత యింటికి జేరుకున్నారు. ఎవరి బీరువాలలోనున్న వారి వుత్తరాలు పరుపుమీద పడేసుకుని ఒకరికొకరు చదువుకుని కడుపులు బ్రద్దలయేటట్లు నవ్వుకున్నారు.

(౦)